సాధారణ ప్రసవాలు జరగాలి

వైద్యాధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో కళాబాయి

జిల్లా వైద్యాధికారిణి కళాబాయి

మహబూబాబాద్, మార్చి 18 : జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరగాలని జిల్లా వైద్యాధికారిణి బీ కళాబాయి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యాధికారులతో జరిగిన సమీక్షలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో గర్భిణుల పేర్లను 12 వారాల్లో నమోదు చేయాలన్నారు. అత్యవసరమైతేనే సిజేరియన్లు చేయాలని, డబ్బుల కోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నారులకు వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. రెండు వారాలకు పైగా దగ్గుతో బాధపడుతున్న వారికి తెమడ పరీక్ష చేయాలన్నారు. టెలీ మెడిసిన్ సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. వేసవి నేపథ్యంలో ఓఆర్ఎస్ కార్నర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో మహబూబాబాద్‌ను ముందుంచాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు నిరంతర పర్యవేక్షణతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష, ప్రోగ్రాం అధికారులు మురళీధర్‌రావు, బిందుశ్రీ, నాగేశ్వర్‌రావు, సుధీర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, డిప్యూటీ డెమో ప్రసాద్, మంగమ్మ పాల్గొన్నారు.

కుష్టు నిర్ధారణకు ఇంటింటా సర్వే

తొర్రూరు, మార్చి 18: కుష్టు వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే చేస్తున్నట్లు డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వనాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని వెలికట్ట శివారు జగ్నతండాలో కుష్టు వ్యాధి నిర్మూలనపై జరుగుతున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులందరికీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొర్రూరు డివిజన్ పరిధిలో 77,394 కుటుంబాలకు గాను ఇప్పటి వరకు 43,944 కుటుంబాలను పరీక్షించామన్నారు. అందులో 317 అనుమానిత కేసులను గుర్తించి పరీక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయ్‌కుమార్, నూతి కృష్ణ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయం 'ఆమె'దే..

- అభ్యర్థుల గెలుపోటముల్లో వారే కీలకం
- పురుష ఓటర్ల కంటే 35,766 ఓట్లు ఎక్కువ

మానుకోట పార్లమెంట్ పరిధిలో మహిళా ఓటర్లు అత్యధికం

మహబూబాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడడంతో ప్రధాన పార్టీల్లో హడావుడి మొదలైంది. పార్లమెంటు స్థానాలకు కొన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించగా, మరి కొన్ని పార్టీలు గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్నాయి. కాగా, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో దాదాపు ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. అయితే, ఇక్కడ అభ్యర్థుల గెలుపోటములను మహిళా ఓటర్లే నిర్ణయించనున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అభ్యర్థుల గెలుపోటముల్లో వారే కీలకం కానున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,27,049 ఓటర్లు ఉండగా, ఇందులో 7,45,589 పురుషులు, 7,81,355 ఓట్లు మహిళలకు ఉన్నాయి. 105 ఇతరుల ఓట్లు ఉన్నాయి. మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 2,57,802 మహిళలకు ఓట్లు ఉన్నాయి. రెండో స్థానంలో నర్సంపేట నియోజకవర్గంలో 2,35,049, మూడో స్థానంలో ములుగులో 2,32,401 ఓట్లు, నాలుగో స్థానం ఇల్లెందులో 2,24,437 ఓట్లు, ఐదో స్థానం డోర్నకల్‌లో 2,22,102 ఓట్లు, ఆరో స్థానం పినపాకలో 2,03,137 ఓట్లు, భద్రాచలం నియోజకవర్గం 1,52,121 ఓట్లతో చివరి స్థానంలో ఉన్నది. ఈ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 1957లో ఆవిర్భవించిన మానుకోట పార్లమెంట్ నియోజకవర్గం 1967లో రద్దయ్యింది. తిరిగి పునర్విభజనలో భాగంగా 2009లో ఏర్పడగా, ఎస్టీకి రిజర్వు చేశారు. అనంతరం 2009లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోరిక బలరాంనాయక్ తన సమీప ప్రత్యర్థి సీపీఐ పార్టీ నుంచి పోటీ చేసిన కుంజ శ్రీనివాసరావుపై గెలుపొందారు. 2014లో టీఆర్ఎస్ నుంచి ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ కాంగ్రెస్ అభ్యర్థి, కేంద్ర మాజీ సహాయ మంత్రి పోరిక బలరాంనాయక్‌పై విజయం సాధించారు. 2019లో బీఆర్ఎస్ నుంచి మాలోత్ కవిత కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌పై 1,46,663 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఈ పార్లమెంట్ పరిధిలో ఎస్టీ జనాభాతో పాటు ఎస్టీల ఓట్లు అధికంగా ఉన్నాయి. నర్సంపేట నియోజకవర్గం మినహాయిస్తే ములుగు, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు ఎస్టీలకు రిజర్వ్ చేశారు. ములుగు, భద్రాచలం, ఇల్లెందులో ఆదివాసీలు, మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేటలో లంబాడాలు ఎక్కువగా ఉన్నారు.

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
డోర్నకల్	1,08,931	1,13,164	07	2,22,102
మహబూబాబాద్	1,26,296	1,31,459	47	2,57,802
నర్సంపేట	1,14,926	1,20,114	09	2,35,049
ములుగు	1,13,422	1,18,953	26	2,32,401
పినపాక	99,610	1,03,522	05	2,03,137
ఇల్లెందు	1,09,622	1,14,811	04	2,24,437
భద్రాచలం	72,782	79,332	07	1,52,121
మొత్తం	7,45,589	7,81,355	105	15,27,049

కీలకం కానున్న మహిళల ఓట్లు..

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో అభ్యర్థి విజయానికి మహిళా ఓట్లే కీలకం కానున్నాయి. ఈ పార్లమెంటు పరిధిలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 35,766 మంది ఎక్కువగా ఉన్నారు. మహిళల ఓట్లు నియోజకవర్గాల వారీగా ఇలా ఉన్నాయి. డోర్నకల్‌లో 4,233, మహబూబాబాద్‌లో 5,163, నర్సంపేటలో 5,188, ములుగులో 5,531, పినపాకలో 3,912, ఇల్లెందులో 5,189, భద్రాచలంలో 6,550 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. మొత్తం ఏడు నియోజకవర్గాల్లో 35,766 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో వీరి ఓట్లే కీలకం కానున్నాయి.

జాతీయ స్థాయి నెట్‌బాల్‌కు యశస్విని

నర్సింహులపేట, మార్చి 18: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని జాతీయ స్థాయి నెట్‌బాల్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆనందబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 8వ తరగతి చదువుతున్న యశస్విని మహబూబానగర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 20 నుంచి 22 వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన యశస్వినిని పీఈడీ శ్రీనివాస్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రైల్వే ప్రయాణికుడి మృతి

డోర్నకల్, మార్చి 18 : డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో సోమవారం ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. జీఆర్పీ ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జగన్ కాలనీకి చెందిన ఫైజాబాబా(62) సికింద్రాబాద్ నుంచి భద్రాచలం వెళ్లే కాకతీయ ఫాస్ట్ ప్యాసింజర్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. తోటి ప్రయాణికులు గమనించి డోర్నకల్ జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు 108 సిబ్బంది సాయంతో రైలు దింపే సమయానికి మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించి, కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కురవి, మార్చి 18 : కురవి, తిర్మలాపురం, రామచంద్రాపురం గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శారద తెలిపారు. రామచంద్రాపురం ఫీడర్ 11కేవీ లైన్‌పై చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, రైతులు, ప్రజలు సహకరించాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలి

నర్సింహులపేట, మార్చి 18: గ్రామాల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లకు బాధ్యతలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రాములు, మాణిక్యం, వీరన్న, లింగ్యా తదితరులు ఉన్నారు.

అశోక్‌కు ఇండియా ఎక్సలెన్సీ అవార్డు

అవార్డు అందుకుంటున్న అశోక్

మహబూబాబాద్ రూరల్, మార్చి 18 : మహబూబాబాద్ పట్టణానికి డాక్టర్ పరికిపండ్ల అశోక్‌కు ఇండియా ఎక్సలెన్సీ అవార్డు లభించింది. 30 సంవత్సరాలుగా విద్య, వైద్యం, ఆరోగ్య స్వావలంబన అంశాలపైన చేస్తున్న సేవలకు ఆయనకు ఈ గుర్తింపు దక్కింది. సోమవారం బెంగళూరులో బ్లిండ్ విండ్‌లో సమావేశంలో ప్రముఖ బాలీవుడ్ నటి అమృతరావు చేతుల మీదుగా అశోక్ అవార్డును అందుకున్నారు. వివిధ కుల సంఘాల నాయకులు అశోక్‌కు అభినందించారు.

టీఎస్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు భద్రీనారాయణకు పరామర్శ

మహబూబాబాద్ రూరల్, మార్చి 18 : టీఎస్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా భద్రీనారాయణ తండ్రి సత్యనారాయణ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్, ప్రజా సంఘాల నాయకులు భద్రీనారాయణను పరామర్శించారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తమ్ రెడ్డి

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మరిపెడ బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యానమ్మందికీ తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **పెద్దబోయిన గణేష్**, S/o : **సైదులు, వయస్సు :** 20 సం॥లు, **వృత్తి :** వ్యవసాయం, **నివాసం :**బుర్హాన్‌పురం, మరిపెడ మండలం, మహబూబాబాద్ జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తగాదాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : గ్రామ పంచాయితి బుర్హాన్‌పురం, మండలం, మండల పరిషత్తు మరిపెడ జిల్లా, జిల్లా పరిషత్తు మహబూబాబాద్, జిల్లా రిజిష్ట్రారు వరంగల్, సబ్ రిజిష్ట్రార్ మహబూబాబాద్ వారి అధికార పరిధిలో గల బుర్హాన్‌పురం గ్రామ పరిధిలోని డోర్ నెం.3-50లోని ఆర్.సి.సి. కప్పు నిర్మిత గృహ విస్తీర్ణం : 533-57 చ॥ఫీ॥ గృహముతో సహా ఖాళీ స్థల విస్తీర్ణం : 286-29 చ॥గ॥లు, సమము : 239-37 చ॥మీ॥, (Assessment No: 391)**డాక్యుమెంట్ నెం.152/2024** గల ఆస్తికి సరిహద్దులు : **తూర్పు:** నలబోలు ప్రతీప్ రెడ్డి గారి గృహము, **పడమర :** పి.డబ్ల్యూడి రోడ్డు, **ఉత్తరం :** బచ్చు ఉపేందర్ గారి గృహము, **దక్షిణం :** షేక్ అమీన్ గారి గృహము.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మరిపెడ బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యానమ్మందికీ తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మాదాసు సైదమ్మ** W/o : **చంద్రయ్య, వయస్సు :** 42 సం॥లు, వృత్తి : గృహిణి, **నివాసం :** బుర్హాన్‌పురం, మరిపెడ మండలం, మహబూబాబాద్ జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తగాదాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : గ్రామ పంచాయితి బుర్హాన్‌పురం, మండలం, మండల పరిషత్తు మరిపెడ జిల్లా, జిల్లా పరిషత్తు మహబూబాబాద్, జిల్లా రిజిష్ట్రారు వరంగల్, సబ్ రిజిష్ట్రార్ మహబూబాబాద్ వారి అధికార పరిధిలో గల బుర్హాన్‌పురం గ్రామ పరిధిలోని డోర్ నెం. 1-232లోని ఆర్.సి.సి. కప్పు నిర్మిత గృహ విస్తీర్ణం : 286-63 చ॥ఫీ॥,ఎ.సి.షీట్ కప్పు నిర్మిత గృహ విస్తీర్ణం : 257-75 చ॥ఫీ॥, గృహముతో సహా ఖాళీ స్థల విస్తీర్ణం : 309-33 చ॥గ॥లు, సమము : 258-63 చ॥మీ॥ (Assessment No: 232) **డాక్యుమెంట్ నెం.2015/2024** గల ఆస్తికి సరిహద్దులు : **తూర్పు :** సోమరపు మల్సూరు గారి గృహం, **పడమర :** కోట యల్లమ్మ గారి గృహము, **ఉత్తరం :** రాగం భిక్షం గారి గృహం, **దక్షిణం :** 18'-0'' వెడల్పు గల రోడ్డు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

పలువురిపై కేసు నమోదు

డోర్నకల్, మార్చి 18 : మాన్యతండాకు చెందిన పలువురిపై డోర్నకల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. మాన్యతండాకు చెందిన బానోత్ గణేశ్ ఈ నెల 15న బంధువుల ఇంటికి వెళ్లొస్తుండగా, రాత్రి సమయంలో అదే తండాకు చెందిన కిషన్, బాలాజీ, వీరన్న, విలన్ అతడిని పట్టుకొని కిషన్ ఇంటికి తీసుకెళ్లి దాడి చేశారు. గణేశ్ తమ్ముడు 100కు డయల్ చేయగా, పోలీసులు గణేశ్‌ను ఏరియా వైద్యశాలకు తరలించారు. బానోత్ చిట్టీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇదిఇలా ఉండగా బానోత్ గణేశ్‌పై అదేతండాకు చెందిన ఓ యువతి తనను చాలాకాలం నుంచి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గ్యాస్ సిలిండర్ సబ్సిడీ రూ.46.90 వచ్చింది..

ఎన్నికలప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పింది. తీరా అధికారంలోకి వచ్చినంక అవేమీ పట్టించుకోవడం లేదు. ఆరు గ్యారెంటీల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న. ఇటీవలే నా భార్య పేరున ఉన్న గ్యాస్ సిలిండర్ రూ.950 చెల్లించి తీసుకున్నాం. కానీ, ప్రభుత్వం నుంచి సబ్సిడీ మాత్రం పడలేదు. కేవలం రూ.46.90 మాత్రమే బ్యాంకు ఖాతాలో జమైనట్లు మెసేజ్ వచ్చింది. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న సమయంలో అన్ని పత్రాలు ఇచ్చిన. ఈ కేవైసీ పేరుతో గ్యాస్ ఏజెన్సీ వారు రూ.250 తీసుకున్నారు. గ్యాస్ సిలిండర్ తీసుకునేటప్పుడు అన్నీ సక్రమంగానే ఉన్నాయన్నరు. ఇప్పుడు ఇలా పైసలు వేశారు. పదే పదే మండల కార్యాలయాల చుట్టూ తిరగడం మాలాంటి పేదలకు భారంతో కూడుకున్న పని. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా పేద పేద ప్రజలను మోసం చేయడం తగదు. **-డొనికెన రామన్న, కొమ్ములవంచ**

నో గ్యారెంటీ!

- అర్హత ఉన్నా అందని గ్యాస్ సబ్సిడీ
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- కేంద్రం ఇచ్చే సబ్సిడీనే ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

Dear Customer, LPG Subsidy of Rs.46.90 has been credited to your A/c No.XXXXX639352 on 18/03/24.-SBI

రూ. 46.90 పైసలు వచ్చినట్లు సెల్ ఫోన్‌కు వచ్చిన మెసేజ్

నర్సింహులపేట, మార్చి 18 : రేషన్ కార్డు కలిగి ఉండి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న పేదలందరికీ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రభుత్వ పెద్దలు పదే పదే చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. అధికారుల నిర్లక్ష్యమో లేక ప్రభుత్వ పర్యవేక్షణ లేకనో కానీ, అర్హత ఉన్నా.. చాలా మంది పేదలకు గృహలక్ష్మీ పథకంలో భాగంగా జీరో కరెంటు బిల్లు, గ్యాస్ సబ్సిడీ అందడం లేదు. ఇదేంటని సిబ్బందిని అడిగితే మళ్లీ మండల కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోమంటున్నారని పేదలు వాపోతున్నారు. ఇప్పటికే ఎన్నో ఇబ్బందులు పడి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నామని, మళ్లీ మండల కార్యాలయాలకు వెళ్లాలంటే వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని ఆవేదన చెందుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గార్ల, మార్చి18: మండలంలోని ముల్కనూర్ పాఠశాలలో 2008-2009 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు, సీతారాములు, వడ్లమూడి శ్రీనివాసరావు, సత్యనారాయణ, నళినీరంగారావును సన్మానించారు.

వందశాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యం

డప్పు చాటింపు వేయిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తొర్రూరు, మార్చి 18: వందశాతం ఆస్తి పన్ను వసూళ్లే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని మున్సిపల్ కమిషనర్ పీ శాంతికుమార్ అన్నారు. తొర్రూరు పట్టణంలో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూళ్లలో భాగంగా సోమవారం కొన్నింటిని సీజ్ చేయడంతోపాటు డప్పు చప్పుళ్లతో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 2023-24 సంవత్సరానికి భారీగా పేరుకుపోయిన ఆస్తి పన్ను దారులకు నోటీసులు ఇచ్చి రెండు మూడు రోజులుగా చెబుతున్నా పన్ను కట్టని సముదాయాలను సీజ్ చేశామని తెలిపారు. మున్సిపల్ శాఖ ఆస్తి పన్నుపై అధిక మొత్తంలో జరిమానాలపై 90శాతం మినహాయింపు ఇస్తున్నందున, బకాయిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ ఆస్తి పన్నులను 90శాతం మినహాయింపుతో సకాలంలో చెల్లించి లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కట్ట స్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు, వార్డు ఆఫీసర్లు దేవేందర్, పట్టాభి, నవీన్, ఉపేంద్ర, బిల్ కలెక్టర్లు శంకర్, యాకయ్య, సిబ్బంది మురళి, చినబాబు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని నిలదీస్తున్న నాయకులు

సభ్యత్వం లేని వారికి మండల అధ్యక్ష పదవులా..?

జిల్లా అధ్యక్షుడిని నిలదీసిన కార్యకర్తలు

మహబూబాబాద్ రూరల్, మార్చి 18 : బీజేపీ సభ్యత్వం లేని వారికి మండల అధ్యక్ష పదవులు ఎలా ఇస్తారని ఆ పార్టీ కార్యకర్తలు ఆరోపించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజక వర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు మండలానికి చెందిన బీజేపీ కార్యకర్తలు మాట్లాడుతూ.. ఎంతో కాలంగా పార్టీలో పని చేస్తున్నామని, తమకు కాకుండా పది రోజుల క్రితం వచ్చిన వారికి మండల అధ్యక్ష పదవులను ఎలా కట్టబెడతారని జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్లును నిలదీశారు. పార్టీ హై కమాండ్ పునరాలోచించి చర్యలు తీసుకోవాలన్నారు.

కేసముద్రం: పరీక్ష రాసేందుకు కల్వల ప్రభుత్వ పాఠశాలకు తరలివచ్చిన విద్యార్థులు

తొలిరోజు ప్రశాంతం

- ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు
- జిల్లాలో 49 కేంద్రాల ఏర్పాటు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

మహబూబాబాద్ రూరల్, మార్చి 18 : పదో తరగతి వార్షిక పరీక్షలు తొలి రోజు సోమవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకపోవడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకున్నది. మొత్తం 49 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 8,192 మంది విద్యార్థులకు గాను 8,173 మంది పరీక్ష రాశారు. 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.15 మంది ప్రైవేట్ విద్యార్థులుండగా, 13 మంది పరీక్ష రాసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర పాఠశాలల పరీక్ష కేంద్రాలను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తనిఖీ చేశారు. మిగతా కేంద్రాలను అదనపు కలెక్టర్ డేవిడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు. హాల్ టికెట్లను సరిచూసుకున్న తర్వాత విద్యార్థులను కేంద్రంలోకి పంపించారు.

కురవి: బోర్డుపై తమకు కేటాయించిన గదిని చూసుకుంటున్న విద్యార్థులు

మహబూబాబాద్‌లోని బాలికల పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

పెద్దవంగర: పరీక్ష సెంటర్ వద్ద నోటీస్ బోర్డుపై హాల్ టికెట్ నంబర్‌ను చూసుకుంటున్న విద్యార్థులు

నర్సింహులపేట: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

నెల్లికుదురు: తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తున్న ఉపాధ్యాయులు

దంతాలపల్లి: పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఇనుగుర్తి: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

భగవద్గీతపై ప్రచారం

గూడూరు, మార్చి18 : మానవ జీవితంలో జ్ఞానమార్గం, యోగ మార్గం ముఖ్యమైనదని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక మహబూబాబాద్ కమిటీ అధ్యక్షురాలు కృష్ణవేణి అన్నారు. సోమవారం మండలంలోని మచ్చర్లలో సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత ప్రాముఖ్యతను వివరిస్తూ గ్రంథాలను వితరణ చేశారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

నెల్లికుదురు, మార్చి 18: చెక్ పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని మహబూబాబాద్ ఆర్డీవో అలివేలు అధికారులను ఆదేశించారు. నెల్లికుదురు క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సోమవారం తహసీల్దార్ రాజుతో కలిసి ఆమె పరిశీలించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

డోర్నకల్: డోర్నకల్ ఎస్సీ, బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు చేశారు. వాహనాలు, బైక్‌లను తనిఖీ చేసి వాటి వివరాలు రికార్డుల్లో నమోదు చేశారు. ఏఈ అలీ, జావీద్, లక్ష్మణ్, శంకర్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలోని సూర్యాపేట రహదారిలో దంతాలపల్లి పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ అక్రమంగా డబ్బు, మద్యం తరలించకుండా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. చెక్ పోస్టును ఎంపీడీ